ప్రజాశక్తి
మంగళవారం 1 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

25 శాతం సబ్సిడీతో రబీ విత్తనం

అక్టోబర్ నుంచి రబీ ప్రారంభం అవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం రబీకి సంబంధించి విత్తన ధరలను నిర్ణయించింది. దీంతో సబ్సిడీని ఖరారు చేసింది. రబీలో అనంతపురం జిల్లాలో అత్యధికంగా సాగయ్యేది పప్పుశనగ పంట. దీనికి సంబంధించి విత్తన కేటాయింపులతోపాటు సబ్సిడీని 25 శాతం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

◆ 'అనంత'కు 27,139 క్వింటాళ్లు, ◆ సత్యసాయి జిల్లాకు 1143 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రబీలో సాధారణంగా రెండు లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగవుతుంది. అందులో అత్యధికంగా అనంతపురం జిల్లా పరిధిలోని నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లో పప్పుశనగ పంటను రైతులు సాగు చేస్తారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది 27,139 క్వింటాళ్ల సబ్సిడీ పప్పుశనగను కేటాయించగా, సత్యసాయి జిల్లాకు 1143 క్వింటాళ్లు కేటాయించింది. ఈ మేరకు పప్పుశనగ అవసరమైన రైతులు క్రిషీ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తరువాత నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాక రైతులకు విత్తనాన్ని అందజేస్తారు.

25 శాతం సబ్సిడీ

రబీలో రెండు రకాలైన పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో జెజి-11 రకం ఒకటి కాగా, కాబులి రకంగా మరోకటి. జెజి-11 రకం పూర్తి ధర క్వింటాళు రూ.94 వేలు కాగా, సబ్సిడీ 25 శాతం రూ.2350 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.7050 ఉంటుంది. కాబూలి రకమైతే క్వింటా పూర్తి ధర రూ.12,100 కాగా సబ్సిడీ రూ.3025 పోనూ రూ.9075 రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్టీ రైతులకైతే 90 శాతం సబ్సిడీతో అందివ్వనున్నారు. ఈ విత్తనాలు 20 కిలోలు ఒక ప్యాకెట్ వస్తాయి. వీటిని అర ఎకరంలోపు ఉంటే ఒక బస్తా ఇస్తారు. ఎకరాలోపుంటే రెండు బస్తాలు, ఒకటిపైన ఒకటిన్నర ఎకరా వరకు భూమి ఉన్నరైతులకు బస్తాలు, రెండు ఎకరాల్లోపు ఉంటే నాలుగు బస్తాలు, రెండున్నర వరకుంటే ఐదు, మూడు ఎకరాలుంటే ఆరు బస్తాలు, మూడున్నర ఎకరా ఉంటే ఏడు బస్తాలు, నాలుగున్నర వరకుంటే ఎనిమిది, ఐదు ఎకరాల వరకుంటే పది బస్తాల వరకు గరిష్టంగా ఇస్తారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు

పర్మినెంట్ చేసి, సమాన పనికిసమాన వేతనం ఇవ్వాలి
సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని సిఐటియు నాయకులు విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ జిల్లా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరికీ కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ, బోనస్, పబ్లిక్ సెలవులు, పే స్లిప్పులు, పిఎఫ్, ఐఎస్ఐ వర్తింపజేయాలన్నారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. చెన్నెకొత్తపల్లి, పెనుగొండ, సోమందేపల్లి, గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి, మడకశిర ప్రాంతాల్లో కియా అనుబంధ, గార్మెంట్ పరిశ్రమల్లో సుమారు 1.20 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని వారందరికీ కనీస వేతనాలు అందించేలా చూడాలన్నారు. చాలా పరిశ్రమల్లో గత 17 సంవత్సరాలుగా వేతనాల్లో పెంపుదల లేదన్నారు. వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన 7వ పేకమిషన్ ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. మహిళా కార్మికులకు పని ప్రదేశాల్లో అన్ని వసతులూ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చెక్కును అందిస్తున్న మంత్రి సవితమ్మ

పిడుగుపాటు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపాటుతో చనిపోయిన దాశరథి నాయక్ కుటుంబాన్ని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ సోమవారం పరామర్శించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, పాడి ఆవుకు రూ.37,500 సాయం అందించారు. రూ.8.75 లక్షల సాయాన్ని మృతుల కుమారుడు జగదీష్ నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శుభ దాస్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు పాల్గొన్నారు.

చేనేతకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తాం

నేడు గుంటూరులో చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం - బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలోని చేనత రంగం, కార్మికుల అభివృద్ధికి కేంద్ర సాయంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందించే చర్యలు చేపడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళవారం నాడు గుంటూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం సందర్భంగా సోమవారం పెనుకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భారత దేశ వారసత్వ సంపదలో భాగంగా చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు జాతీయ చేనేత దినోత్సవం ముఖ్య ఉద్దేశం అన్నారు. చేనేతకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా సహకార సంఘాల ఉత్పత్తి, అమ్మకాలను మెరుగు పరచి వాటిని బలోపేతం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనను గుంటూరులో మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. చేనేత వస్త్ర ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 80 చేనేత సంఘాలు, సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. నూలు, పట్టు చీరలు, పావడాలు, దుప్పట్లు, డ్రెస్ మెటీరియల్, కలంకారి మొదలగు చేనేత ఉత్పత్తులు అమ్మకాలు ఇందులో ఉంటాయన్నారు. చేనేత కార్మికులకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నేతత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. యువ చేనేత కార్మికులకు కొత్త కొత్త డిజైన్ల రూపకల్పనపై శిక్షణ ఇస్తామన్నారు. చేనేత వస్త్రాలకు మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని తెలియజేశారు. విజయవాడలో గాంధీ బునకర్ పేరుతో చేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని, దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రూ.2 కోట్లకు పైగా విలువజేసే చేనేత వస్త్రాలను ఎగ్జిబిషన్ ద్వారా విక్రయాలు జరిగాయన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నామని చెప్పారు. చేనేత వస్త్రాలకు జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేయాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఆర్డీవోలు బాధ్యతల స్వీకరణ

ధర్మవరం - మహేష్, పెనుకొండ -ఆనంద్‌కుమార్

ధర్మవరం-ప్రజాశక్తి రూరల్

ధర్మవరం, పెనుకొండ డివిజన్‌ల నూతన ఆర్డీవోలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం ఆర్డీవోగా మహేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకట శివారెడ్డి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మహేష్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఆర్డీవోను ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, తహశీల్దార్ నటరాజ్, డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరయ్యలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేష్

పెనుకొండ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆనంద్‌కుమార్

పెనుకొండ ఆర్‌డివోగా ఆనంద్ కుమార్

పెనుకొండ : పెనుకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆనంద్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆనంద్ కుమార్ ఉద్యోగోన్నతిపై పెనుకొండ ఆర్డీవోగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, పరిగి, పెనుకొండ, లేపాక్షి తహశీల్దార్లు హసీనా సుల్తానా, వరలక్ష్మి, శ్రీధర్ తదితరులు అభినందనలు తెలిపారు.

కబ్జా నుంచి అసైన్డ్ భూమిని కాపాడండి

రైతుసంఘం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అసైన్డ్ భూమిని కబ్జా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని గరుడంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు రైతుసంఘం ఆధ్వర్యంలో ఆర్డీవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మండల కార్యదర్శి ఆలకుంట మారుతి మాట్లాడుతూ గరుడంపల్లి గ్రామ సర్వే నెంబర్ 593-10లో 4.45 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో స్థానిక పేద రైతులు పశువులు షెడ్లు, పశువులు మేతకి సంబందించిన దొడ్లు వేసుకుని చాలా ఏళ్ల నుంచి ఉన్నారన్నారు. కొన్నాళ్ల క్రితం సాకే నారాయణ స్వామి అనే వ్యక్తి ఆ భూమి తన పేరుపై రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. ఏళ్ల తరబడి అక్కడున్న పేద రైతులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని దౌర్జన్య చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి ఈ అసైన్డ్ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు చంద్రాయుడు, మురళి, నరసింహులు బాల పెద్దన్న, కుమార్, పద్మావతి, పోతలయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో సోమవారం జిల్లా ఫుట్ బాల్ సంఘం ఆద్వర్యంలో జిల్లా సీనియర్ ఫుట్ బాల్ జట్టును ఎంపిక చేశారు. తొలుత 30 మంది ప్రాబబల్స్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనీల్ కుమార్ మాట్లాడుతు ఎంపిక చేసిన వారికి మరో సారి క్రీడా పోటీలను నిర్వహించి, తుది జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక చేసిన జట్టును త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకోశాధికారి శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్, ఉపాధ్యక్షులు ఇర్షాద్ అలి, కోచ్‌లు రాఘవేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

ఎంపిక చేసిన ఫుట్ బాల్ జట్టుతో జిల్లా సంఘం అధ్యక్షులు, పిడిలు

కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జిబివుల్లా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును కోరారు. ఈ మేరకు వైస్ చైర్మన్ జిబివుల్లా ఆధ్వర్యంలో వైసిపి కౌన్సిలర్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ సంఘం శ్రీనివాసులును సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ మున్సిపల్ చట్టం 1965 మేరకు వెంటనే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు రోషన్ అలీ, నాగేంద్రబాబు, షాజియా, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వన్‌టౌన్ ఎస్ఐగా కె.శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వన్‌టౌన్ ఎస్ఐగా శ్రీధర్ సోమవారం భాధ్యతలను స్వీకరించారు. అనంతరం సిఐ రాజగోపాల్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు పట్టణ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

రొద్దం ఎస్ఐగా నరేంద్ర

రొద్దం : రొద్దం ఎస్ఐగా నరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన ప్రముఖ పట్టు చీరల వ్యాపారి అశ్వర్థ నారాయణ సోమవారం చౌడేశ్వరి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు సౌండ్‌సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మధుసూదన రెడ్డి మాట్లాడుతూ రూ. 20వేలు విలువ చేసే సౌండ్ సిస్టం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత, లక్ష్మీదేవి, మక్తర్, ప్రభాకర్, ధనలక్ష్మి, వసుధ, అంజన మూర్తి, ఫామిదా, ఈశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే : ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - గోరంట్ల

చట్టం దృష్టిలో అందరూ సమానమే అని ఎస్పీ రత్న అన్నారు. సోమవారం మండలంలోని వానవోలు గ్రామ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమే అని ప్రతి ఒక్కరూ పౌర హక్కులను పొందాలని అన్నారు. ఎవరైనా పౌర హక్కులకు భంగం కలిగిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ బాలసుబ్రహ్మణ్యం, ప్రదీప్, సిఐ శేఖర్, తహశీల్దార్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

బుక్కపట్నం : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. సివిల్ రైట్స్ డే పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సమాజ స్థాపన, హక్కుల పరిరక్షణ ఎస్సీ ఎస్టీ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నేటి సమాజంలో కుల వివక్షత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వీఆర్వో లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ డిటిగా నారాయణస్వామి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ డిప్యూటీ తహశీల్దార్‌గా జి నారాయణస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణం రామ్‌నగర్ 37 వార్డులో టిడిపి కార్యకర్త లక్ష్మణ స్వామిపై సోమవారం దాడి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు లక్ష్మణస్వామి తన స్నేహితులతో మాట్లాడుతుండగా అటు వైపు నుండి కారులో వచ్చిన మల్లి కార్జున రెడ్డి వారితో వాగ్వాదానికి దిగాడు. ఎన్నికల సమయంలో జరిగిన పాత కక్షలు మనసులో పెట్టుకొని తనపై వైసిపికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చందమూరు నారాయణ రెడ్డి బావమరది మల్లి కార్జున రెడ్డి దాడి చేసాడని బాధితుడు లక్ష్మణ స్వామి ఆరోపించారు. గాయపడిన లక్ష్మణ స్వామిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు సందా రాఘవ ఆసుపత్రికి చేరుకొని లక్ష్మణస్వామిని పరామర్శించారు. ఈ ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణస్వామి

దీపక్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సి ఎపి) ఛైర్మన్‌గా టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని సీడ్ ఎపి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధికారి దీపక్‌రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధినాయకులు, సిఎం చంద్రబాబు తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీడాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దీపక్‌రెడ్డి

కందికాపుల సర్పంచికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-పుట్లూరు

దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 2వ తేదీ జరిగే స్వచ్ఛత మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది సర్పంచులకు ఆహ్వానం అందింది. అందులో మండలంలోని కందికాపుల సర్పంచి శివరామయ్యకు ఆహ్వానం అందింది. దీంతో శివరామయ్యను జిల్లాలోని సర్పంచులు, మండల నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధనరాజు, తదితరులు అభినందించారు.

సర్పంచి శివరామయ్య

కంపచెట్లు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని 17వ వార్డులో పెరిగిన కంపచెట్లను తొలగించాలని ఆవార్డు కౌన్సిలర్ సుభద్రా నాగేంద్ర కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. నగర పంచాయతీ పరిధిలోని పెనుగొండ రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్సీ శ్మశాన వాటికలో పెరిగిన కంపచెట్లను తొలగించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

ప్రజాశక్తి www.prajasakti.com

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని ఆమిదాల గొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, టి ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి చేతులమీదుగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని గుర్రప్పకొండ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు డి రంగప్ప మనవడు హయాన్స్ జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెష్టాస్ కంపెనీ మేనేజర్ భవ్య మంజునాథ్, సీనియర్ పాత్రికేయులు గోవిందప్ప, దివ్య, జ్యోతి, సాయి చరణ్, ఆయుర్వేదిక్ విద్యార్థి కావ్య, రాధమ్మ, సుజాతమ్మ పాండురంగప్ప మంజమ్మ తేజస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-పెనుకొండ

విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర ముతవల్లి అసోసియేషన్ తరపున సోమవారం ఆర్థికసాయం అందజేశారు. మంగళగిరిలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు రూ.7.86 లక్షల విలువైన చెక్కును ముతవల్లి అసోసియేషన్ సభ్యులు అందించారు. పెనుకొండ శ్రీ బాబయ్య స్వామి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా రూ. 2లక్షలు, మిగిలిన మొత్తం ముతవల్లి అసోసియేషన్ సభ్యులు కలిపి అందించారు. ఈ కార్యక్రమంలో కెఎం షకీల్ షఫీ, ఉబేదుళ్ళ ,మదనపల్లె అబ్దుల్ దర్గా పీఠాధిపతి అబ్దుల్ హుసేనీ, ముతవల్లిలు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక అంబేద్కర్ భవనంలో ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ మహేష్, సిఐ జనార్దన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరుల హక్కులను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆదినారాయణ, ఆర్ఐ ప్రమీలమ్మ, వికలాంగుల రమేష్, రాజేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

లేపాక్షి : స్థానిక ఓరియంటల్ పాఠశాల ఆవరణం లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి లో కోకో, కబడ్డీ, చెస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాగా ఆడి ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సురేష్ కుమార్, శివకుమార్, పిఇటిలు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య వార్షిక మహాసభ

మడకశిర : చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు మహాలక్ష్మి అధ్యక్షతన 22 వ వార్షిక మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శిచే వార్షిక నివేదిక సమర్పించి చర్చ అనంతరం ఆమోదం తెలిపారు. పాలక సభ్యుల ఎన్నిక పదవి కాలం నిర్ణయం తదితర విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా ఆదిలక్ష్మమ్మ, కార్యదర్శిగా ఇంద్రజ, కోశాధికారిగా పరిమళను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య ఎపిఎం జె. రవి, సీసీ లక్ష్మీ కాంత్, స్త్రీనిధి మేనేజర్ నరేశ్ వర్మతో పాటు సిసిలు, ఆయా గ్రామాలకు చెందిన మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

గాండ్లపెంట డిటిగా బాబురావు

ప్రజాశక్తి - గాండ్లపెంట

గాండ్లపెంట డిప్యూటీ తహశీల్దార్‌గా బి బాబురావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక సివిల్ సప్లై బియ్యం గోడౌన్ స్టాక్ పాయింట్ పనిచేస్తున్న ఆయన ఇటీ మండలానికి డిటిగా బదిలీ అయ్యారు.

నల్లచెరువు ఎస్ఐగా మక్బూల్‌బాషా

నల్లచెరువు: నల్లచెరువు ఎస్ఐగా మక్బూల్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన కెం. లింగన్న బదిలీపై పుట్టపర్తి రూరల్ వెళ్లారు.

పెనుకొండ ఎస్ఐగా వెంకటేశ్వర్లు

పెనుకొండ : పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సి కె పల్లి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు బదిలీపై ఇక్కడికి వచ్చారు. మొదట క్రితం పెనుకొండ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం జరిగిన బదిలీల్లో పలు స్టేషన్లో పనిచేసిన ఆయన తిరిగి పెనుకొండకు బదిలీపై వచ్చారు.

టిడిపి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శికి శుభాకాంక్షలు

మడకశిర : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సోదరుడు గుండుమల రాధాకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని రాధాకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, పట్టణ మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, గణేష్, దాసిరెడ్డి, మద్దన కుంటప్ప, కుమార్ స్వామి, జడ్పిటిసి ఉమేష్, భక్తర్ షరీఫ్, కొన్నిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు రమణారావు

ప్రజాశక్తి-సోమందేపల్లి

భవన నిర్మాణరంగ కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు అనుబంధ భవన నిర్మాణసంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో సోమవారం భవన కార్మిక సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశ నికి ముఖ్యఅతిథిగా హాజరైన నారపల్లి రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు శ్రీ సత్య సాయి జిల్లాలో లక్ష మందికి పైగా ఉన్నారని అన్నారు. వారికి జిల్లాలో పనులు లేక బెంగళూరు చెన్నై నగరాలకు వలస వెళ్తున్నారన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చ ఏశారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుకను ఉచితంగా ఇస్తామని వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారే కాని వాటిపై ఎలాంటి ఊసే లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు కావస్తున్నా సంక్షేమ బోర్డు, సంక్షేమ పథకాలు ఊసే ఎత్త లేదన్నారు రాష్ట్రంలో 30 లక్షల మంది దాకా నిర్మాణ కార్మికులు ఉన్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. దిష్టిబొమ్మల్లా ఉన్న లేబర్ ఆఫీసుల్లి నిర్మాణ కార్మికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కొత్త లేబర్ కార్డుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై అక్టోబర్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలకు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు. సత్యసాయి జిల్లాలోని అన్ని రకాల నిర్మాణ కార్మికులతో పాటు ఇతర సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, అధ్యక్షులు రామకృష్ణ, సహాయ కార్యదర్శి రంగప్ప, నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, మహిళా నాయకురాలు స్వర్ణలత, సోమందేపల్లి మండల నాయకులు నాగభూషణ, రవి, గోరంట్ల మండల నాయకులు కిరణ్, సురేష్ ,రామాంజి, పెనుకొండ మండల నాయకులు మధు, రొద్దం మండల నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని హిందూపురం రోడ్డు లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవి భూషణ్, కన్వీనర్లు దాసిరెడ్డి, మనోహర్, లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, జడ్పిటిసి ఉమేష్, మాజీ జడ్పిటిసిలు నరసింహమూర్తి, నన్నప్పమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బి ఎస్. గురుమూర్తి, మాజీ ఎంపీపీలు మీనాక్షి రామిరెడ్డి, క్రిష్ణప్ప, కృష్ణమూర్తి, నరసింహప్ప, నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యకాసం జిల్లా కోశాధికారిగా సాకే వెంకటేష్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారిగా సాకే వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పెద్దన్న ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే వెంకటేష్‌ను జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు, ఫిరంగి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత ఆంజనేయులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరిస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపి వెంటనే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ వి రత్న తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సమస్యలతో వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, వృద్ధులు, వికలాంగుల ఫిర్యాదుల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్మ్ శ్రీనివాసులు , లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డిసిఆర్బి సిఐ శ్రీనివాసులు సిబ్బంది ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో కౌన్సిల్ సమావేశం వాయిదా

అధికారుల కోసం ఎదురు చూస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజా సమస్యలను చర్చించేందుకు ఏర్పాటుచేసిన అత్యవసర కౌన్సిల్ సమావేశం అధికారుల నిర్లక్ష్యంతో వాయిదా పడింది. సోమవారం పెనుకొండ నగర పంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్పర్సన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సమావేశం మూడు గంటలకు ప్రారంభమవుతుందని కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులకు మున్సిపల్ సిబ్బంది సమాచారం అందించారు. మూడు గంటలకు ప్రారంభమవుతుందని చైర్మన్ ఉమర్ ఫరూక్ వైస్ చైర్మన్ సునీల్ కుమార్, కౌన్సిల్ సభ్యులందరూ 2:45గంటలకే సమావేశ భవనంలో హాజరయ్యారు. సమావేశం నాలుగు గంటలు అయినా ప్రారంభం కాలేదు. సమావేశం ప్రారంభించాల్సిన కమిషనర్ శ్రీనివాసులు మేనేజర్ నాగరాజులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యులు నాలుగు గంటల వరకు వేచిచూశారు. సమస్యలు చర్చించేందుకు అధికారులు లేకపోవడంతో తామ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. సభ్యుల కోరిక మేరకు చైర్మన్ సమావేశాన్ని వాయిదా వేశారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశాన్ని ప్రారంభించి నడిపించాల్సిన కమిషనర్ మేనేజర్లు ఇద్దరు సమావేశానికి హాజరు కాకపోవడంతోనే వాయిదా వేసినట్లు తెలిపారు. మూడు నెలలుగా సమావేశాన్ని నిర్వహించలేదని నగర పంచాయతీలో పలు సమస్యలు నెలకొన్నాయని సభ్యులు సమస్యల పరిష్కారం కోసం చర్చించేందుకు సిద్ధ మైన నేపథ్యంలో అధికారులు లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందినారని ఆయన అన్నారు. సమావేశం ప్రారంభించిన అనంతరం కమిషనర్ వెళ్లి ఉంటే బాగుండేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఆయాలకు వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వెంకాళ్ళ పైన కూర్చొని గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జెవి రమణ, ఆయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ మాట్లాడుతూ 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కోసం స్వచ్ఛ భారత్ అనే ముద్దు పేరుతో అనేక మంది మహిళలను పారిశుధ్య పనుల కోసం నియమించిందన్నారు. అప్పటినుంచి వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. ప్రతి కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి అని వేల రూపాయలు ఇవ్వాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి వున్న ఆరు నెలలు వేతనాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యదర్శి నాగవేణి, అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కోశాధికారి లక్ష్మి, కమిటీ సభ్యులు వరలక్ష్మి, అంజనమ్మ, వెంకటలక్ష్మి పరియాణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

నారాయణ పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని నారాయణ పాఠశాలలో ముందస్తు విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణ పాఠశాలల డీన్ రమేష్ బాబు, సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఎం సర్ఫరాజ్ ఖాన్ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు దసరా పండుగ విశిష్టత ను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థిని ,విద్యార్థుల సాంప్రదాయ దుస్తులు అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్ఫరాజ్ ఖాన్ పఠాన్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పండుగ విశిష్టతను తెలియజేసే విధంగా విద్యను బోధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల అకడమిక్ డీన్ జి విష్ణువర్ధన్ రెడ్డి, ఏవో జక్రియ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెడ్డి హరిత, ఈ కిడ్స్ రాశినేని హరిత, ఈ చాంప్స్ నియామత్, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ముందస్తు దసరా వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ : జేసీ

సమస్యలు వింటున్న జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సామాజిక పింఛన్ల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి 247 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు డిఆర్ఓ కొండయ్య, ఓఆరిడిఎ పీడీ నరసయ్య, సర్వశిక్షా నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. దినపత్రికలో వచ్చే వార్త కథనాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తగు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంగళవారం పింఛన్ల పంపిణీ ఎటువంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, పట్టు పరిశ్రమ జేడీ పద్మమ్మ, ఏపిఎం వైపి పీడీ సుదర్శన్, సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతల నుంచి కోలుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థులు మానసిక రుగ్మతల నుండి త్వరగా కోలుకోవాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కె.రాకేష్ పిలుపునిచ్చారు. సోమవారం పుట్టపర్తి లోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం లోని భవిత పాఠశాలను ఆయన సందర్శించారు. బుద్ధి మాంద్యపు పిల్లల ఆలోచన ధృక్పథాలు వారి జీవన శైలిని ఉపాధ్యాయులు జడ్జికి వివరించారు. ఈ సందర్భంగా జడ్జి పిల్లలతో ముచ్చటించారు. వారికోసం రూ. 40 వేల విలువ గల ఆట వస్తువులు పెన్నులు, పుస్తకాలు, ఇతర స్టేషనరీ వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ బాలాజీ నాయక్, క్రిమినల్ విభాగపు క్లర్క్ మంజునాథ్ ,సివిల్ విభాగపు క్లర్క్ అర్చనారాయణ. కోర్టు కానిస్టేబుల్లు హరినాథ్ పెద్దారెడ్డి రామాంజనేయులు, చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ,ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయొద్దు

ప్రజాశక్తి బత్తలపల్లి

ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని, అనవసరంగా ఎస్సీ,ఎస్టీ చట్టాలను దుర్వినియోగపర్చవద్దని బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు.సోమవారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో ప్రజల ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో సాయిమనోహర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీలు అన్యాయానికి గురై ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తారన్నారు. అనంతరం అంబేద్కర్ ఆశయాల గురించి వివరించారు. ఈ సదస్సులో గ్రామస్తులు,పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన నాగేంద్ర (45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు ఆదివారం రాత్రి భార్యాభర్తలు ఇద్దరూ గొడవపడ్డారు దీంతో మనస్తాపానికి గురైన నాగేంద్ర పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్ర మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నేకొత్తపల్లి పోలీసులు తెలిపారు.

తనకల్లులో మరో యువకుడు...

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని భీమ్లా నాయక్ తండాకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకటరమణ నాయక్, (23) చెడు వ్యసనాలకు బానిస య్యాడు. అతని వైఖరి మార్చుకోవాలని తల్లిదండ్రులు మందలించగా మనస్తాపం చెందిన వెంకటరమణ నాయక్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున వెంకటరమణ నాయక్ మృతిచెందాడు. మృతుడి తండ్రి నానునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

మహిళపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని పోతులకుంట గ్రామానికి చెందిన వివాహితపై ఈడే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు. గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన ఆదే గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి అనే యువకుడు ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆ యువకుడి స్తంభానికి కట్టేసి చితకబాదారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సిఐ ఇందిరా, పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని యువకుడిని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ సమీపంలో అక్రమంగా నిలువ ఉంచిన బాణాసంచా స్థావరంపై ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2,28,590లు అని పోలీసులు తెలిపారు. బాణసంచా నిల్వ ఉంచి వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బంగారు దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - ఓబులదేవర చెరువు

మండల కేంద్రంలోని హిందూపురం కదిరి ప్రధాన రహదారి లో ఉన్న పవిత్ర జువెలరీ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రూ. 19 లక్షల విలువ గల బంగారం వెండిని ఎత్తుకెళ్లి నట్లు షాప్ యజమాని రామాచారి తెలిపారు. షాపు యజమాని చెప్పిన వివరాల మేరకు పవిత్ర జువెలరీ దుకాణానికి అనుకొని ఉన్న మరో ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు ఆ ఇంటి కిటికీని తొలగించి పక్కన ఉన్న గోడకు రంధ్రం వేసి దుకాణంలోకి ప్రవేశించి 200 గ్రాముల బంగారం, కిలో వెండి ఎత్తుకెళ్లారు. సిఐ నాగేంద్ర రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి దుకాణానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రల సేకరణ బృందాన్ని రప్పించి తనిఖీలు నిర్వహించారు. షాప్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ధర్మవరంలో ఇళ్లు కూల్చివేత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో ఫుణ్యర్స్ అసోసియేషన్ వారి ఇళ్లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనెంబర్ 650లో ఉన్న భూమి విషయంపై ఇరువైపుల గా కోర్టులో కేసు ఉందని ఆ కోర్టుకు తుది తీర్పు వెలువడకముందే ప్రత్యర్థులు ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంలో ధర్మవరం పట్టణానికి చెందిన గొడుగు నాగరాజు, సోము, జేసీబీ యజమాని హిటచీలతో వచ్చి దౌర్జన్యంగా కార్మికుల కట్టుకుంటున్న ఇళ్లను కూల్చివేశారనివాపోయారు. కూల్చివేత ద్వారా మూడు లక్షల దాకా యాభై లక్షల రూపాయల వరకు నష్టపోయామని ఫుణ్యర్స్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. ఈ విషయంలో నాగరాజు, సోము తమ వెనుక పెద్ద నాయకులు ఉన్నారని, వారు చెబితేనే తాము ఈ పని చేశామని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కార్మికులకు న్యాయం చేయాలని ఒకటవ పట్టణ సిఐకి బాధితులు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - హిందూపురం

రూరల్ మండల పరిధిలోని ఎల్ఆర్జి పబ్లిక్ స్కూల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. హిందూపురం నుంచి తూముకుంట వైపు వెళుతున్న ఆటోను పెన్నా ఏరియా నుంచి ఇసుకను నింపుకుని హిందూపురం పట్టణం వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై అప్ గ్రేడ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

డీలర్‌ను మార్చాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని పులేరు గ్రామంలో షాప్ నెంబర్10 డీలర్‌ను మార్చాలని టిడిపి నాయకులు స్థానిక తహశీల్దార్ మారుతి ప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు సరిగా సరుకులు పంపిణీ చేయని ఆ డీలర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, నరసింహులు, చంద్రారెడ్డి, వేణు రాయల్, జయరాం, కిషోర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, బొమ్మిలి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ ఎక్సైజ్ సిఐగా సృజనబాబు

ప్రజాశక్తి - పెనుకొండ

పెనుకొండ ఎక్సైజ్ సిఐగా సృజన బాబు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల ముందు చిత్తూరు జిల్లా కుప్పంకు బదిలీపై వెళ్లిన ఈయన ఎన్నికల అనంతరం పెనుకొండకు వచ్చారు. కరోనా లాక్ డౌన్ సమయంలో సృజన బాబు పెనుకొండ ఎక్సైజ్ సీఐగా పనిచేశారు అనంతరం జరిగిన సాధారణ బదిలీలలో కర్నూలు జిల్లా కోసిగి బదిలీపై వెళ్లారు. అనంతరం బదిలీపై పెనుకొండకు వచ్చారు.

ఎన్పీకుంట ఎస్ఐగా వలిబాషా

ప్రజాశక్తి - నంబులపూలకుంట

నంబులపూలకుంట ఎస్ఐ వలిబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని ఎనుములవారి పల్లి, గ్రామ ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్‌డేను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ సిఐ శ్యాంరావు మాట్లాడుతూ ఎస్సీ లకు రాజ్యాంగ కల్పించిన హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్నం ఎస్ఐ నరసింహుడు, పోలీసులు, ఎస్సీ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.